మోగుతున్న నీటి గంట


చిత్తపార హైస్కూల్లో నీళ్లు తాగుతున్న విద్యార్థులు

- పాఠశాలల్లో విద్యార్థుల దాహార్తి తీర్చే ఏర్పాటు
- రోజుకు మూడు సార్లు వాటర్ బెల్
- పిల్లలు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చర్యలు

గుడిపాల: మండలంలోని పాఠశాలల్లో నీటి గంట సరిగ్గా మోగుతోంది. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు, చిన్నారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉదయం 8 గంటల నుంచే ఉక్కపోత ప్రారంభమవుతుంది. మధ్యాహ్న సమయానికి ఎండ తీవ్రత తారాస్థాయికి చేరుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరంలో నీటిశాతం తగ్గిపోయి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ సమస్యను అధిగమించడానికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మూడు సార్లు వాటర్‌బెల్ కొట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఎక్కడా నిర్లక్ష్యం చూపకుండా తప్పనిసరిగా నీటి గంట ఆదేశాలు అమలు చేయాలని విద్యాశాఖ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఉదయం 10, 11, 12 గంటలకు నీటి గంట కొట్టి విద్యార్థులు మంచినీరు తాగేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులందరికీ సురక్షిత నీరు అందుబాటులో ఉంచాలని, వాటర్ ప్లాంట్లు పనిచేయకపోతే తక్షణం మరమ్మతులు చేయించాలని, వాటర్ ప్లాంట్ల నుంచి సురక్షిత మంచినీటిని డబ్బాల్లో అందుబాటులో ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ప్రస్తుతం ఒంటిపూట బడులు నడుస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. 8గంటల నుంచి ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నానికి తీవ్రస్థాయికి చేరుతుంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో వాటర్ బెల్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించింది. చిత్తూరు నియోజకవర్గంలో 188 స్కూళ్లలో 12,350 మంది విద్యార్థులు ఉన్నారు.

అందుబాటులో సురక్షిత నీరు

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మనబడి నాడు–నేడు కార్యక్రమం అమలు చేసింది. పాఠశాలల్లో అత్యాధునిక సదుపాయాలతో పాటు విద్యార్థులు సురక్షిత మంచినీరు తాగేలా నీటి శుద్ధి యంత్రాలను సరఫరా చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేసింది. 50 శాతం పాఠశాలల్లో ప్రభుత్వం మరికొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందించిన ఆర్వో ప్లాంట్లలో కొన్ని మరమ్మతులకు గురికావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో రోజుకు 5 నుంచి 10 వరకు వాటర్ టిన్నులు అందజేస్తున్నారు. ఇలాంటి అవకాశం లేని చోట్ల ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే వాటర్ టిన్నులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మూడుసార్లు వాటర్ బెల్ విధానం పటిష్టంగా అమలు చేస్తున్నాం. ఉదయం 10, 11, 12 గంటలకు తప్పనిసరిగా వాటర్ బెల్ కొట్టి విద్యార్థులందరూ మంచినీరు తాగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. వాటర్ ప్లాంట్లు పనిచేయకపోతే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించాం.

–హసన్‌బాషా, ఎంఈఓ, గుడిపాల

క్లుప్తంగా

వేడుకగా పంగుని బ్రహ్మోత్సవాలు


కేడయ ఉత్సవంలో ఊరేగుతున్న స్వామివారు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పంగుని బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఉదయం స్వామికి అభిషేక పూజలు చేసి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. కేడయ ఉత్సవంపై ఆశీనులు చేసి నగర వీధుల్లో ఊరేగించారు. రాత్రి కామధేను ఉత్సవంలో ఊరేగించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు కర్పూరహారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పవన్

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని 104 వైద్యాధికారి పవన్ అన్నారు. నంగమంగళంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాలకు వచ్చి వైద్య సేవలు పొందే గ్రామీణులకు ప్రస్తుతం ఇంటి వద్దకే వైద్యసేవలు తీసుకువచ్చినట్లు చెప్పారు. అనంతరం సుగర్, బీపీ, గర్భవతులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇంటికే పరిమితమైన వారిని ఇళ్లవద్దకు వెళ్లి వైద్యం అందించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి, యమున, శ్రీలత, వరలక్ష్మి, సరిత, రూబి పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్


సీజ్ చేసిన ఇసుక లారీ

గుడిపాల: తమిళనాడుకు అక్రమంగా వెళుతున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. చిత్తూరు నుంచి తమిళనాడుకు శుక్రవారం ఇసుక అక్రమంగా వెళుతున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో గొల్లమడుగు ఇసుక చెక్‌పోస్ట్ వద్ద ఉండగా లారీని తనిఖీ చేయగా ఎటువంటి రికార్డులు లేక తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నందున లారీని సీజ్ చేసినట్లు చెప్పారు. తమిళనాడుకు చెందిన రాజా(43), రాము(45)పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు



గుడిపాల: విద్యుత్ బిల్లుల చెల్లింపులను సరళతరం చేయాలనే ఉద్దేశంతో క్యూఆర్ కోడ్‌ను ఎస్పీడీసీఎల్ అందుబాటులోకి తీసుకొచ్చింది. బిల్లులను చెల్లించేందుకుగాను కొందరు వసూలు కేంద్రాలకు వెళ్తుండగా, మరికొందరు ఆన్‌లైన్ విధానాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ చెల్లింపులు జరిపే వినియోగదారులు కొంతకాలంగా ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితరాల ద్వారా జమ చేసే ప్రక్రియను నిలిపేసి, ఎస్పీడీసీఎల్ యాప్‌ను సంస్థ ప్రవేశపెట్టింది. అయితే ఇది సక్రమంగా పనిచేయకపోవడం, వినియోగం కష్టతరమైంది. ఫలితంగా చెల్లింపుల్లో చాలా జాప్యం జరుగుతోంది. ఈ తరుణంలో ఈ ఇక్కట్లకు చెక్ పెట్టేందుకు గానూ క్యూఆర్ కోడ్‌ను ఎస్పీడీసీఎల్ ఈ నెల 1న అమల్లోకి తీసుకువచ్చింది. వినియోగదారులకు ఇచ్చే బిల్లులోనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించి అందజేస్తున్నారు. ఫలితంగా ఇబ్బందులు కొంతమేర తీరాయి. బిల్లులో పొందుపరిచిన క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా స్కాన్‌చేసి నగదును చెల్లించే అవకాశం ఏర్పడింది. ఐతాయిల్లేని వారికే ఈ తరహాలో బిల్లు ప్రస్తుతానికి జారీ అవుతోంది.

జగ్జీవన్‌రామ్ సేవలు స్మరించుకుందాం

చిత్తూరు కార్పొరేషన్: బాబూ జగ్జీవన్‌రామ్ సేవలను స్మరించుకుందామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించాలని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశాడని, ఆయన చేసిన సేవలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గుడిపాల: డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని ఇందిరాక్రాంతి ఏపీఎం సుధారాణి అన్నారు. మండలంలోని మరకాలకుప్పం, వసంతాపురం, శ్రీరంగంపల్లె మహిళా సంఘాల సభ్యులకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంఘాల్లోని ప్రతి సభ్యురాలు వారి కుటుంబ అవసరాలు, జీవనోపాధి, ఆదాయ అభివృద్ధి కోసం 2025–26 ఆర్థిక సంవత్సరంలో కావాల్సిన పెట్టుబడి, రుణాలు పొందడం, డబ్బులను సక్రమంగా వినియోగించే విధానాలు, రుణాల చెల్లింపులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం తీసుకున్న రుణాలన్నింటినీ సకాలంలో చెల్లించినట్లయితే ఏ గ్రేడ్ స్థాయిలో ఆ సంఘాలు నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

యాదమరిలో మోస్తరు వర్షం

యాదమరి: మండలంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో వేసవి తాపానికి విలవిల్లాడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. మామిడి రైతులకు ఈ వర్షం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి చరిత చెప్పారు.

వైభవంగా కుంభాభిషేకం

కుంభాభిషేకానికి హాజరైన భక్తులు




విశేషాలంకరణలో సాయిబాబా

బంగారుపాళెం: మండలంలోని పాలేరు గ్రామంలో జగనన్న కాలనీలో శుక్రవారం శ్రీ షిరిడీ సాయిబాబా నూతన ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, అవబృద యాగ పూజ, యంత్రా దానం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గట ఉద్వాసనం, శిఖర కుంభాభిషేకం, శ్రీ షిరిడి సాయిబాబా కుంభాభిషేకం చేపట్టారు. అనంతరం సాయినాథుని మూల విగ్రహాన్ని విశేషంగా అంకరించి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. భక్తులు సాయినాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయాలి

బంగారుపాళెం: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయాలని మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో వార్షిక కార్యాచరణ ప్రణాళికపై మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సాగులో రైతులు ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భూమి కలుషితమై, భూసారం దెబ్బతింటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేకూర్చుతాయన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రవి, అధికారులు అంబికాగాంధీ, విజయ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షం


తవణంపల్లె మండలంలో అకాల వర్షం కురిసింది. ఉక్కబోతతో అల్లాడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల మామిడి పంటలో బంక పోయే అవకాశముందని రైతులు అభిప్రాయపడుతున్నారు. – తవణంపల్లె

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మారుతున్న కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఐలవారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసి వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఎండలో వీలైనంత వరకు తిరగకపోవడం ఆరోగ్యానికి మంచిదన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎస్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు శక్తి యాప్


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విద్యార్థినులు, మహిళల రక్షణ కోసమే శక్తియాప్ అని మహిళా డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలోని శ్రీవిజ్ఞానతేజ స్కూల్లో శుక్రవారం శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఘటనలకు తెలుసుకుని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు, అపరిచితులను పసిగట్టాలన్నారు. వారితో జాగ్రత్తగా వ్యవహరించి పోలీసులకు సమాచారం అందించవచ్చని చెప్పారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఈ శక్తి యాప్ విద్యార్థినులు, మహిళల రక్షణగా పనిచేస్తోందన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంజనీ, ఎస్‌ఐలు నాగసౌజన్య, కరీ మునీషా, పాఠశాల నిర్వాహకులు కుమార్, నవమణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీలో అనుబంధ విభాగాల నియామకాలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం వివరాలను ప్రకటించింది. చిత్తూరు రూరల్ మండల యూత్ అధ్యక్షుడిగా స్టాండ్లీ, మహిళ విభాగం అధ్యక్షురాలిగా ప్రతిమారెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడిగా రవినాయుడు, బీసీ సెల్ –రఘునాథ్, ఎస్సీసెల్ – ప్రభాకర్, ఎస్టీసెల్ – దొర, మైనారిటీ సెల్ – గౌస్, క్రిస్టియన్ సెల్ – రాజీవ్‌గాంధీ, విద్యార్థి విభాగం – వినోద్, పంచాయతీరాజ్ – సుబ్రమణ్యం, వలంటీర్ – కృష్ణమూర్తి, గ్రీవెన్స్ సెల్ – మురుగ, వాణిజ్య విభాగం – శరణ్‌కుమార్, వైఎస్సార్‌టీయూసీ – పట్టాభి, సోషల్ మీడియా విభాగం – తేజ, ఐటీ విభాగం – జ్యోతిష్, ఇంటలెక్చువల్ విభాగం – లోకనాథన్, బూత్‌కమిటీ విభాగం – అరవింద్, పబ్లిసిటీ విభాగం – అశోక నియమితులయ్యారు. గుడిపాల మండల యూత్ విభాగం అధ్యక్షుడిగా విజయకృష్ణ, మహిళా విభాగం– కళ్‌లెఖ్షిరసి, రైతు విభాగం – మనోహర్‌రెడ్డి, బీసీసెల్ – కృష్ణమూర్తియాదవ్, ఎస్సీసెల్ – రఘు, ఎస్టీసెల్ – రాము, మైనారిటీ సెల్ – అమీన్‌బాషా, క్రిస్టియన్ సెల్ – డేవిడ్‌అయ్యదొరై, విద్యార్థి విభాగం – అజిత్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగం – ప్రసాద్‌రెడ్డి, వలంటీర్స్ విభాగం – రేణుకుమార్, గ్రీవెన్స్ సెల్ – చిట్టిబాబు, వాణిజ్య విభాగం – సంపత్‌కుమార్, సోషల్ మీడియా – నరేష్‌రెడ్డి, ఐటీవిభాగం – పుంగనూరు హస్వంత్, ఇంటలెక్చువల్ విభాగం – వెంకటేష్‌రెడ్డి, బూత్‌కమిటీ విభాగం – విజయశేఖర్‌ను నియమించారు.

రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

గుడిపాల: భూముల రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయంతి, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ బాషా పిలుపునిచ్చారు. చీలాపల్లెలో శుక్రవారం రీసర్వేకి సంబంధించి రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో రీసర్వేకు సంబంధించి ఏయే ప్రాంతాల్లో సర్వే చేస్తారో రెండు రోజులు ముందుగానే రైతులకు సమాచారం ఇస్తామన్నారు. రైతులు భూమి రికార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలు, ఫోన్ నంబర్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వీఆర్వోలకు అందజేయాలన్నారు. రైతులు సర్వేకు హాజరై తమ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో ఇస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 10వ తేదీ నుంచి గుడిపాల మండలంలో చీలాపల్లె, సీఎం కండ్రిగ రెవెన్యూలో రీసర్వే కార్యక్రమం మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో రీసర్వే డెప్యూటీ తహసీల్దార్ రూపాదేవి, ఆర్‌ఐ రమాసాయి, సర్వేయర్ గోపి, వీఆర్‌ఓలు భారతి, భవదీప్, విలేజ్ సర్వేయర్లు హేమలత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన


ప్రదర్శనలో ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు

గుడిపాల: మండలంలోని సీఎస్ఆర్ పాఠశాలలో శుక్రవారం సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓలు హసన్‌బాషా, గణపతి మాట్లాడుతూ, విజ్ఞానశాస్త్రం ప్రాముఖ్యత, ఉపయోగాలను తెలియజేయడమే ఉద్దేశమన్నారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు నౌషాద్, ప్రాథమిక వైద్యాధికారి సంధ్య, బొమ్మసముద్రం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శరత్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సైన్స్‌కు సంబంధించిన విషయాలు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు కొత్త అంశాలతో తయారుచేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లోకేష్, ప్రధానోపాధ్యాయురాలు ఖాతుంబి, సుధ, రోబోటిక్ ట్రైనర్ దీప, ఉపాధ్యాయులు హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

దోమల బారినుంచి కాపాడుకుందాం


బాధితులకు కిట్ అందిస్తున్న వేణుగోపాల్

గుడిపాల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమల బారినుంచి ప్రతి ఒక్కరూ కాపాడుకోవచ్చని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. ఫ్రైడే –డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేరువుముందరపూరు గ్రామాన్ని ఆయన తనిఖీచేశారు. దోమలపై లార్వాలు ఎక్కడైనా ఉన్నాయా అని సిబ్బందితో పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచితే దోమలను తరిమికొట్టి, జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అనంతరం ఫైలేరియా(బోధకాలు)తో బాధపడుతున్న 47 మందికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కిట్‌ను అందజేశారు. ఇందులో 5 రకాల వస్తువులు ఉంటాయన్నారు. ప్లాస్టిక్ టబ్, టవల్, సోప్, మగ్గు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆయనతో పాటు డాక్టర్ సంధ్య, సబ్‌యూనిట్ ఆఫీసర్ నారాయణ, సిబ్బంది నారాయణ, విజయ, సరస్వతి పాల్గొన్నారు.

దోమల వ్యాప్తితో ప్రాణాంతక జ్వరాలు

యాదమరి: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోకుంటే దోమలు వ్యాప్తి అధికమై ప్రాణాంతక జ్వరాలు ప్రబలమవుతాయని గ్రామీణ వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరిమాకులపల్లెలో శుక్రవారం డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, దోమకాటు వల్ల ప్రమాదకర డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్, మెదడువాపు వంటి జ్వరాలు వ్యాపిస్తున్నాయని చెప్పారు. దీనిని మొదటి దశలోనే గుర్తిస్తే చికిత్స అందించడం సులభతరం అవుతుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదమని హెచ్చరించారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ నివాస పరిసరాల్లో శుభ్రత పాటించి దోమలకాటు నుంచి కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు భువనేశ్వరి, రమాదేవి, రమీల, ప్రజలు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామనవమి వేడుకలు


అరగొండ కోదండరామస్వామి దేవస్థానం

తవణంపల్లె: మండలంలోని అరగొండ శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో రేపటి నుంచి శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నారు. ఆదివారం నుంచి 17వ తేదీ వరకు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహకులు తెలిపారు. 6వ తేదీన ఉదయం సీతారామ లక్ష్మణులకు అభిషేకం, రాత్రి హంస వాహన సేవ ఉంటుందని చెప్పారు. 7న సోమవారం ఉదయం స్వామికి అభిషేకం, రాత్రిలో సింహ వాహన సేవ, 8వ తేదీన మంగళవారం ఉదయం స్వామికి తిరుమంజనం, రాత్రి హనుమంత వాహన సేవ, 9న బుధవారం ఉదయం స్వామికి అభిషేకం, పూజలు, రాత్రి శేష వాహన సేవ, 10వ తేదీన గురువారం ఉదయం అభిషేకం, రాత్రి గరుడ వాహన సేవ ఉంటుందని పేర్కొన్నారు. 11న శుక్రవారం అభిషేకం, ప్రత్యేక పూజలు, ఐరావత వాహన సేవ, 12వ తేదీన శనివారం ఉదయం అభిషేకం, పూజలు, 11 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం 3 గంటలకు రథోత్సవం, 13వ తేదీన ఆదివారం స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు, ఉదయం 9 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహన సేవ ఉంటుందని వెల్లడించారు. 14వ తేదీన సోమవారం ఉదయం అభిషేకం, పూజలు, రాత్రి అశ్వవాహన సేవ, 15వ తేదీన మంగళవారం ఉదయం స్వామికి అభిషేకం, రాత్రి పుష్పపల్లకి సేవ, 16వ తేదీన బుధవారం ఉదయం అభిషేకం, పూజలు, రాత్రి విమానోత్సవం, 17న గురువారం ఉదయం మహా సుదర్శన హోమం, 11 గంటలకు వసంతోత్సవం, 4 గంటలకు పట్టాభిషేకం ఘనంగా జరుగుతుందని వెల్లడించారు. భక్తులు విశేషంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కోలావూరులో ..

గుడిపాల: మండలంలోని కోలావూరు గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలు రేపటి నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కోదండరామస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి 9 రోజుల పాటు ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంపూర్ణ రామాయణ హరికథా గానం నిర్వహించనున్నట్లు తెలిపారు. 6న శ్రీరామజననం, 7న విశ్వామిత్ర యాగ సంరక్షణ, 8న సీతారామ కళ్యాణం, 9న శ్రీరామ పాదుకా పట్టాభిషేకం, 10న భక్త శబరీ మోక్షము, 11న సుగ్రీవ పట్టాభిషేకం, 12న సుందరకాండ, 13న అంగద రాయబారం–రామ రావణ యుద్ధం, 14న శ్రీరామ పట్టాభిషేకంతో పాటు అన్నదానం చేయనున్నట్లు వివరించారు. అదే రోజు రాత్రి 10గంటలకు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఊరేగింపు ఉంటుందని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి


వృద్ధులను పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎస్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మత్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 32 మంది రోగులకు వైద్య సేవలందించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు.